# ఆగని వాన.. రైతన్నల ఆందోళన

- భారీ వర్షంతో నీట మునిగిన పంటలు
- పత్తి, మొక్కజొన్న, పొగాకు పంటలకు నష్టం


కోవెలకుంట్ల: సొదరదిన్నె సమీపంలో మిరపలో చేరిన వర్షపు నీరు


తిమ్మాపురం-నందివర్గం రహదారిపై నీటి ఉధృతి

**కోవెలకుంట్ల:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లో రెండు రోజులుగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం సబ్ డివిజన్‌లోని ఉయ్యాలవాడ మండలంలో అత్యధికంగా 28.8 మి.మీ, సంజామల మండలంలో 22.8 మి.మీ, అవుకులో 22.6 మి.మీ, కొలిమిగుండ్లలో 20.2 మి.మీ, దొర్నిపాడులో 19.8 మి.మీ, కోవెలకుంట్ల మండలంలో 18.8 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఆయా మండలాల వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. తుఫాన్ ప్రభావంతో కోవెలకుంట్ల పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఆయా మండలాల్లో కురిసిన భారీ వర్షాలతో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పత్తి, మొక్కజొన్న, పొగాకు పంటలకు నష్టం వాటిల్లింది. పత్తి పంటలో పూత, పిందె రాలిపోగా కోత దశలో ఉన్న మొక్కజొన్న కంకులు వర్షానికి తడిచిపోవడంతో దిగుబడులు రంగు మారుతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షంతో పొగాకు, జొన్న పంటలు దెబ్బతినడంతో ఆందోళన చెందుతున్నారు. తుపాన్ కారణంగా మరో రెండు రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణ హెచ్చరికలతో రైతులు దిగాలు చెందుతున్నారు. కోవెలకుంట్ల మండలం కంపమల్ల సమీపంలో బుచ్చమ్మ కుంట ఉప్పొంగి ప్రవహించడంతో రహదారిలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

**ఆలస్యంగా సెలవు ప్రకటనతో ఇబ్బందులు**

**కొలిమిగుండ్ల:** తుఫాన్ ప్రభావంతో జిల్లా ఉన్నతాధికారులు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు బుధవారం సెలవు ప్రకటించారు. అయితే ఉదయం ఎనిమిదిన్నర గంటలకు సెలవుగా సమాచారం అందించడంతో అప్పటికే ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాలలకు చేరుకున్నారు. వర్షంలోనే వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులు అష్టకష్టాలు పడి వచ్చారు. తీరా పాఠశాలలకు చేరుకున్నాక సెలవు ఇవ్వడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ముందుగానే ప్రకటించి ఉంటే విద్యార్థులకు వ్యయప్రయాసలు ఉండేవి కావని విద్యార్థులు తల్లితండ్రులు పేర్కొన్నారు. మండలంలో బుధవారం తెల్లవారుజము నుంచి మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. అత్యవసర పనులు ఉన్న వారు తప్ప మిగిలిన వారు ఇళ్లకే పరిమితమయ్యారు.

**బనగానపల్లెలో 50.2 మి.మీ వర్షపాతం**

**బనగానపల్లె:** మండలంలో మంగళవారం అర్ధ రాత్రి నుంచి బుధవారం ఉదయం 11 గంటల వరకు 50.2 మి.మీ వర్షపాతం నమోదైంది. మొక్కజొన్న, పత్తి, మిరప తదితర పంటలు నీట మునిగాయి. మొక్కజొన్న పంట నూర్పిడి సమయంలో వర్షం కురవడంతో తీవ్రంగా నష్టపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బనగానపల్లె నియోజకవర్గంలో మొత్తం 3,692 హెక్టార్లలో మొక్కజొన్న సాగు చేయగా బనగానపల్లె మండలంలోనే 2939 హెక్టార్లలో ఈ పంటను వేశారు. బనగానపల్లె-నంద్యాల మార్గంలోని తిమ్మాపురం- నందివర్గం మధ్య రోడ్డుపై నీరు ఉధృతంగా ప్రవహించడంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే అప్పలాపురం నుంచి టంగుటూరు మధ్య నీటి ప్రవాహానికి రాకపోకలు స్తంభించాయి. 20 రోజులుగా తరచూ వర్షం కురుస్తుండడం వల్ల జొన్న పంట వేసేందుకు అదును దాటిపోయినట్లు రైతులు ఆవేదన చెందుతున్నారు.


మొక్కజొన్నలో వర్షపు నీరు

**సంజామలలో భారీ వర్షం**

**సంజామల:** మండల కేంద్రం సంజామలతో పాటు పలు గ్రామాల్లో బుధవారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురిసింది. పత్తి, మొక్కజొన్న, పొగాకు రైతులకు ఈ వర్షం శాపంగా మారింది. పంటల్లో వర్షపు నీరు నిల్వ ఉండడంతో పంటలు దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా పొలాల్లో నుంచి బయటకు పంపాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.


అమడాలలో నీట మునిగిన జొన్న పంట


కోవెలకుంట్ల: పొగాకు పంటలో వర్షపు నీరు


ఆకుమల్ల: మిరుప పంటలో నిల్వ ఉన్న నీరు


కోవెలకుంట్ల: కంపమల్ల వద్ద ఉప్పొంగి ప్రవహిస్తున్న బుచ్చమ్మ కుంట

## క్లుప్తంగా

### రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ


విద్యార్థినిని అభినందిస్తున్న హెచ్‌ఎం

**కోవెలకుంట్ల:** పట్టణంలోని సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల విద్యార్థిని రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ చాటినట్లు హెచ్‌ఎం గీతా తెలిపారు. ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో తొమ్మిదో తరగతి విద్యార్థిని శాన్విత వెండి పతకం కైవసం చేసుకుందన్నారు. విద్యార్థినిని హెచ్‌ఎంతోపాటు కరస్పాండెంట్ మేరీ, ఫిజికల్ డైరెక్టర్లు ఓబులేసు, హర్ష, ఉపాధ్యాయులు అభినందించారు.

### స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు


స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును ప్రారంభిస్తున్న ట్రాన్స్‌కో ఏడీఈ

**కోవెలకుంట్ల:** ప్రస్తుతం ఉన్న మీటర్ల స్థానంలో స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ సతీష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయ ఆవరణలో స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాన్స్‌కో కార్యాలయ పరిధిలో ముందుగా ప్రభుత్వ కార్యాలయాలు, వీధిదీపాలు, తాగునీటి పథక సర్వీసులకు స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. రానున్న రోజుల్లో అన్ని సర్వీసులకు వీటిని అమర్చుతామని పేర్కొన్నారు. ఏఈ రామమోహన్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు


గోపాలస్వామి విగ్రహానికి అభిషేకం చేస్తున్న భక్తులు

**కోవెలకుంట్ల:** మండలంలోని వల్లంపాడు గ్రామంలో జీర్ణోద్ధరణ గావించిన గోపాలస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. రెండు రోజులపాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా ప్రధాన అర్చకుడు సతీష్‌శర్మ ఆధ్వర్యంలో మొదటి రోజు ప్రాత:కాల పూజ, హోమం, తదితర పూజలు నిర్వహించారు. గురువారం స్వామివారి విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### మున్సిపల్ కార్మికునికి నివాళి


జోసెఫ్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న చైర్మన్, కమిషనర్

**డోన్:** స్థానిక కొండపేటకు చెందిన మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుడు జోసెఫ్ బుధవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, కమిషనర్ ప్రసాద్‌గౌడ్ మృతుడి నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. అంత్యక్రియల కోసం రూ.15 వేలను కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతుని కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. డీఈ రఘు, ఏఈ సురేష్ ఉన్నారు.

### పంట నమోదు జాబితా ప్రదర్శన


రైతు సేవా కేంద్రంలో జాబితాను పరిశీలించేందుకు వచ్చిన రైతులు

**బేతంచెర్ల:** మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఖరీఫ్ ఈ-పంట నమోదు చేసిన జాబితాను సామాజిక తనిఖీ కోసం ప్రదర్శించినట్లు వ్యవసాయ అధికారి కిరణ్‌కుమార్ తెలిపారు. వివరాల్లో తప్పులు ఉంటే వెంటనే సరిచేసుకోవాలని సూచించారు. రెండుమూడు రోజుల్లో తుది జాబితా ప్రదర్శిస్తామని తెలిపారు.

### విద్యుత్ సమస్యలుంటే సమాచారం ఇవ్వండి

**డోన్ టౌన్:** ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలతో విద్యుత్ సమస్యలు తలెత్తితే 1912 నంబర్ కాల్ చేసి సమాచారం ఇవ్వాలని ఏఈ నాగేశ్వరరెడ్డి తెలిపారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. వర్షంలో తడిసిన విద్యుత్ స్తంభాలను చేతులతో తాకరాదని, ఇంట్లో ఉన్న కరెంటు స్విచ్ బోర్డులను తడి చేతులతో ఉపయోగించరాదని సూచించారు. సమస్యలు ఉంటే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. చిన్న పిల్లలను విద్యుత్ పరికరాలకు దూరంగా ఉంచాలన్నారు.

## ప్రజా సమస్యల ప్రత్యేక దృష్టి


మారెమడుగులలో భూములను పరిశీలిస్తున్న జేసీ విష్ణుచరణ్

**అవుకు:** ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టిసారించాలని జేసీ విష్ణు చరణ్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం అవుకు రెవెన్యూ కార్యాలయాన్ని ఆర్‌డీఓ మహేశ్వర్ రెడ్డితో కలిసి జేసీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ.. రైతులు, ప్రజల నుంచి వివిధ సమస్యలపై వచ్చే వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. అలాగే రెవెన్యూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. రెవెన్యూ రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. రెవెన్యూ కార్యాలయంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండల పరిధిలోని పలు రెవెన్యూ పనులపై అధికారులతో చర్చించారు. అనంతరం ఉప్పపాడు, జూనుంతల, కొండమనాయినపల్లె, మరెమడుగుల, పిక్కలపల్లి తండాల్లో సోలార్ ప్రజెక్ట్ కోసం సేకరించిన భూములను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ సువర్ణదేవి, డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున రెడ్డి ఉన్నారు.

## కార్మికుల సమస్యలపై వినతి


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**డోన్ టౌన్:** మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి శివరామ్, మండల అధ్యక్షుడు రామాంజనేయులు కోరారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అర్హత కలిగిన డ్రైవర్లకు రూ.24,500, మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా, పలు సాకులు చూపి తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని కోరారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఫెడరేషన్ అధ్యక్ష కార్యదర్శులు పెద్ద ఎల్లయ్య, కుల్లాయప్ప ఉన్నారు.

## ప్రజా సమస్యలు పట్టవా

**డోన్ టౌన్:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికొదిలేశాయని సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు నక్కి శ్రీకాంత్, కొయిలకొండ నాగరాజు ఆరోపించారు. బుధవారం పట్టణంలోని తారకరామానగర్‌శాఖ 2వ మహాసభలను నిర్వహించారు. తారకరామానగర్, ఆటోనగర్ కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్మికులు, రైతులకు తీరని అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. నిత్యావసర సరుకుల ధరలు పెరిగి సామన్యులపై ఆర్థిక భారం పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

**నూతన కమిటీ ఎన్నిక**

తారకరామానగర్ సీపీఎం నూతనశాఖ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా అక్బర్‌బాషాతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. సీఐటీయూ నేత చిన్న రహిమాన్, సీపీఎం నాయకులు కుల్సూంబీ, రామంజినమ్మ, మదార్‌బీ, మహబూబ్ బాషా, సుంకన్న, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

### ఆకర్షిస్తున్న మనీ ప్లాంట్

**డోన్:** స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని చైర్మన్ చాంబర్‌కు మనిప్లాంట్ కొత్త శోభను ఇచ్చింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.7 కోట్లతో అత్యాధునిక వసతులతో మున్సిపల్ కార్యాలయాన్ని నిర్మించారు. సుందరీకరణలో భాగంగా కార్యాలయం ఆవరణ అంతా పచ్చిక బయళ్లతో వాకింగ్ ట్రా క్‌ను కూడా ఏర్పాటు చేశారు. చైర్మన్ సప్తశైల రాజేష్ ప్ర త్యేక శ్రద్ధతో కార్యాలయ ముఖద్వారాల వద్ద వేసిన మనీప్లాంట్‌లు సందర్శకులను ప్రత్యేకంగా ఆకర్షిస్తున్నాయి.


మున్సిపల్ చైర్మన్ చాంబర్ కార్యాలయం వద్ద మనీప్లాంట్

### శనగ విత్తనాల పంపిణీ ప్రారంభం

**కొలిమిగుండ్ల:** రబీ సీజన్‌లో సబ్సిడీ శనగ విత్తనాల పంపిణీని వ్యవసాయాధికారులు ప్రారంభించారు. బుధవారం రెండో విడతలో శనగలు మంజూరు కావడంతో కొలిమిగుండ్ల, ఇటిక్యాల, పెద్దవెంతుర్ల తదితర రైతు సేవా కేంద్రాల్లో రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. మండలానికి 2450 కింటాళ్ల విత్తనాలు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 1950 క్వింటాళ్లు వచ్చాయి. మిగిలినవి త్వరలోనే వస్తాయని అధికారులు పేర్కొన్నారు.

### బియ్యం ప్యాకెట్ల విరాళం

**ప్యాపిలి:** పత్తికొండలో జరగనున్న వాల్మీకి జయంతి వేడుకలకు స్థానిక మహర్షి వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు 8 బియ్యం ప్యాకెట్లను విరాళంగా అందజేశారు. ఉత్సవాలకు హాజరు కానున్న భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నందున బియ్యం ప్యాకెట్లు అందజేసినట్లు ఎంవీఆర్‌పీఎస్ నాయకులు తెలిపారు. నాయకులు బంగి నాగరాజు, రామాంజనేయులు, అచ్చన్న, నాగరాజు, బాలరంగయ్య, జయన్న పాల్గొన్నారు.

### నూతన కార్యవర్గం ఎన్నిక


ఏపీ ఐటీఐ స్టాఫ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

**కర్నూలు (సిటీ)/డోన్ టౌన్:** ఆంధ్రప్రదేశ్ ఐటీఐ/డీఎల్‌టీసీల స్టాఫ్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ సంఘం రాష్ట్ర కమిటీ తరఫున ఎన్నికల అధికారులుగా బి.కోదండరామయ్య, సూరప్ప, ఏపీ ఎన్‌జీవోస్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంగళరెడ్డి వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడిగా బి.ప్రకాష్ రావు, ఉపాధ్యక్షులుగా టి.హరీష్ కుమార్, ఎస్.లక్ష్మిదేవి, జిల్లా కార్యదర్శిగా ఎన్.శిరీష, సహాయ కార్యదర్శులుగా ఎస్.అబ్దుల్ నబి రసూల్, ఎ.నిర్మల, జిల్లా కోశాధికారిగా సి.సూర్యశేఖర్ రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు ఈసీ మెంబర్లుగా నాగేంద్రప్రసాద్, రామయ్య, బి.శ్రీనివాసులు, ఎస్.ఇంతియాజ్ ఎన్నికయ్యారు.

## కుందూ నదికి పోటెత్తిన వరద

- ఉధృతంగా ప్రవహిస్తున్న నది
- లోతట్టు ప్రాంతాలు అప్రమత్తం


ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూనది


బేతంచెర్లలో కురుస్తున్న వర్షం

**కోవెలకుంట్ల:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు తోడు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి నీటిని విడుదల చేయడంతో కోవెలకుంట్ల మండలంలోని పలు ప్రాంతాల్లో ప్రవహిస్తున్న కుందూనదికి వరదనీరు పోటెత్తింది. కుందూకు మరింత వరద పెరిగే అస్కారం ఉండడంతో నదీతీర గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల పరిధిలోని 30 గ్రామాల ప్రజలకు తాగు, సాగునీరు పుష్కలంగా చేరింది. ఈ నెల 1వ తేదీ నుంచి రబీ సీజన్ ప్రారంభం కావడంతో నదీ తీర పరివాహక ప్రాంతాల్లో వివిధ పంటల సాగుకు నీరు అందుబాటులో ఉండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**బేతంచెర్లలో 26.6 మి.మీ వర్షపాతం**

**బేతంచెర్ల:** పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఉదయం నుంచి ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఎడ తెరిపి లేకుండా వర్షం కురవడంతో పాఠశాలలకు సెలవు ప్రకటించారు. మండలంలో 26.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

## రోడ్ల నిర్మాణానికి భూమి పూజ


సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ నిర్వహిస్తున్న ఎంపీడీఓ వెంకటరమణ


గోర్లగుట్ట గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంపీడీఓ

**బనగానపల్లె రూరల్ :** మండలంలోని నందవరం, నందివర్గం పలుకూరు, రామక్రిష్టాపురం, గోవిందిన్నె గ్రామంలో పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా బుధవారం సీసీ రోడ్లు, డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులకు ఎంపీడీఓ వెంకటరమణ భూమి పూజ చేశారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ రమణ, ఎన్ఆర్‌జీఎస్ ఈసీ మక్బుల్, ఏపీఎం రేష్మ తదితరులు పాల్గొన్నారు,

**బేతంచెర్ల:** మండల పరిధిలోని గోర్లగుట్ట, హెచ్ కొట్టాల, రహిమానుపురం, గూటుపల్లె గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రజాప్రతినిధులతో కలిసి ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ భూమి పూజ చేశారు. కార్యక్రమాల్లో సర్పంచ్ లు లక్ష్మిదేవి, శ్రీరాములు, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూస్ ఇంజనీర్లు రాజశేఖర్‌రెడ్డి, మహేష్, ఏపీఓ శేషన్న పాల్గొన్నారు.

### మద్యం బాటిళ్లు స్వాధీనం

**కోవెలకుంట్ల:** మండలంలోని గుళ్లదూర్తి గ్రామానికి చెందిన వ్యక్తి నుంచి బుధవారం మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన మద్దిలేటి అనే వ్యక్తి బెల్ట్‌షాపు ద్వారా మద్యం బాటిళ్ల విక్రయిస్తుండగా సమాచారం మేరకు దాడి చేశామన్నారు. మద్యం విక్రేతను అదుపులోకి తీసుకుని 10 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## నష్ట నివారణకు సస్యరక్షణే కీలకం

- అధిక వర్షాలతో పంట దిగుబడిపై ప్రభావం
- కంది, మొక్కజొన్న, ఆముదం, వేరుశనగ పంటలకు చీడపీడలు ఆశించే ప్రమాదం
- నష్ట నివారణకు ఏడీఏ అశోక్‌వర్ధన్‌రెడ్డి సూచనలు


వేరుశనగ పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ ఏడీఏ అశోక్‌వర్ధన్‌రెడ్డి

**డోన్:** డోన్ వ్యవసాయశాఖ సబ్‌డివిజన్ పరిధిలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో పంటలకు చీడపీడలు ఆశించే ప్రమాదం ఉందని వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు. అల్పపీడనంతో ఏర్పడిన అసాధారణ పరిస్థితి వల్ల ఈ ప్రాంతంలో సాగవుతున్న కంది, వేరుశనగ, ఆముదం, మొక్కజొన్న పంటలకు చీడపీడల బెడద అధికంగా ఉంటుందన్నారు. చీడపీడల నివారణ కోసం రైతులకు వ్యవసాయ సంయుక్త సంచాలకులు అశోక్‌వర్ధన్‌రెడ్డి సూచనలు, సలహాలను అందజేశారు.

**కంది..** సబ్‌డివిజన్‌లో అత్యధికంగా 75 వేల ఎకరాల్లో కంది పంట సాగు చేశారు. ప్రస్తుతం పూతదశలో ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పంట పొలంలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. నీరు ఆగితే చిన్నచిన్న కాల్వల ద్వారా నీటిని పక్కకు తొలగించే చర్యలు చేపట్టాలి. వర్షాలతో కంది పంటకు ఇనుప ధాతువు లోపం వచ్చే అవకాశం అధికంగా ఉంటుంది. ఇందుకు ఫెర్రస్ సర్ఫేట్ ద్రావణాన్ని 5 ఎంజీని ఒక లీటర్ నీటితో కలిపి పంటపై పిచికారీ చేసుకోవాలి. వర్షం నిలిచిన తర్వాత ఎకరాకు 20 కేజీల యూరియాను మొక్క పాదల్లో పడేవిధంగా వేసుకుంటే పంట ఎదుగుదల ఆగిపోకుండా కాపాడుకోవచ్చు.

**వేరుశనగ..** సబ్‌డివిజన్ పరిధిలో 15 వేల ఎకరాల్లో వేరుశనగ పూతదశ, కాయ గట్టిపడే దశలో ఉన్నాయి. వర్షాలతో పంటకు బూజు తెగుళ్లు, సూక్ష్మపోషక ధాతులోపాలు కనపడే అవకాశం ఉంటుంది. ఈ బూజు తెగుళ్ల నివారణకు టుబుకోనజోల్ 200 మి.మీ లేదా హెక్సాకొనజోర్ 400 మి.మీ ఒక ఎకరా పంటకు పిచికారీ చేయాలి. అదేవిధంగా సూక్ష్మదాతు, ఇనుముదాతు లోపం నివారణకు లీటర్ నీటిలో 5 గ్రాముల ఫెర్రస్ సర్ఫేట్, ఒక గ్రాము సిట్రిక్ యాసిడ్‌ను కలుపుకుని పంటపై పిచికారీ చేయాలి.

**ఆముదం..** మొత్తం 5 వేల ఎకరాల్లో ఆముదం పంట సాగవుతోంది. గింజలు గట్టిపడే దశలో ఉన్నందున వర్షాలతో బోట్రైటిస్ అనే బూజు తెగులు ఆశించి పంట దిగుబడి ఘననీయంగా తగ్గిపోయే ప్రమాదం ఉంది. ఈ తెగుళ్ల నివారణకు ఒక లీటర్ నీటిలో మూడు గ్రాముల కార్బన్‌డైజెఎంను 200 లీటర్ల మందు ద్రావణాన్ని ఆముదం గెలలపై వర్షం నిలిచిన వెంటనే వారం వ్యవధిలో రెండుసార్లు పిచికాచీ చేసుకోవాలి.

**మొక్కజొన్న..** మొక్కజొన్న 5వేల ఎకరాల్లో సాగవుతోంది. కంకి గింజలు గట్టిపడే దశలో మరియు పూతదశలో ఉంది. పొలంలో ఆగిన నీటిని వెంటనే తొలగించాలి. ఎకరాకు 50 కేజీల యూరియా మరియు 20 కేజీల పొటాషియంను పంటపై వేయాల్సి ఉంటుంది. పెరిగే దశలో ఉన్న పైరుకు కాండం తొలుచు పురుగు, ఎండు ఆకు తెగులు రావడానికి అవకాశం ఉంటుంది. వీటి నివారణ కోసం 400 మి.మీ ప్రొఫెనోపాస్ మరియు 200 మి.మీ ప్రొపికోనడోల్ అనే ద్రావణాలను 200 లీటర్ల నీటితో కలిపి పిచికారి చేయాలి. కోత దశలో ఉన్న కండెలను పలుచగా పేర్చి ఎండలో ఆరబెట్టాలి.

### కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

**నంద్యాల:** పట్టణంలోని చామకాల్వ రోడ్డుపై గుర్తు తెలియని కారు ఢీకొనడంతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం రాత్రి చామకాల్వ సెంటర్ వద్ద జూపాడుబంగ్లా మండలం లింగాపురం గ్రామానికి చెందిన సోలోమెన్(65) నడుకుంటూ వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సోలోమెన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ మల్లికార్జున తెలిపారు.